సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



దిగుబడిపై దిగులు..!
వాతావరణ మార్పులు ఫలరాజంపై పగ బట్టాయి. ఈ ఏడాది నవంబర్ నెల నుంచే చలితో పాటు దట్టమైన పొగమంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. - 8లో



హత్య కేసులో ముగ్గురు అరెస్టు
చక్రాయపేట మండలం గండికొవ్వూరులో దండు యోగాంజనేయులు హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /23.2

వాతావరణం
జిల్లాలో సోమవారం 23.2 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

11, 12 తేదీల్లో కలెక్టర్ల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర సచివాలయంలో ఈనెల 11, 12 తేదీలలో కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నారు. అజెండాలోని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లాలోని ఆయా శాఖల అధికారులు సేకరించి కలెక్టర్‌కు నివేదించారు. తొలిరోజు ఉదయం సెషన్‌లో గ్రీవెన్స్, ఆర్‌టీజీఎస్, వాట్సాప్ గవర్నెన్స్, జీఎస్‌డబ్ల్యుఎస్‌లు ఉంటాయి. మధ్యాహ్నం సెషన్‌లో వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, పౌరసరఫరాలు, అటవీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధి హామీ, గ్రామీణ తాగునీరు, సెర్ప్, మున్సిపల్, శాంతిభద్రతలు అనే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించనున్నారు. మరుసటిరోజు ఉదయం సెషన్‌లో పరిశ్రమలు, ఐటీ, ఐటీఈ అండ్ సీ, ఐఅండ్‌ఐ, విద్యుత్, మానవ వనరుల అభివృద్ధి, రహదారులు, గృహ నిర్మాణం, సోషల్ వెల్ఫేర్, బీసీ మైనార్టీ సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమం, రెవెన్యూ (భూములు, రిజిస్ట్రేషన్, స్టాంపులు), ఎక్సైజ్, గనులపై చర్చ కొనసాగుతుంది. జిల్లా అభివృద్ధి ప్రణాళికల ప్రెజెంటేషన్ నిర్వహిస్తారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశానికి హాజరు కానున్నారు.

14 నుంచి క్రీడా పోటీలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పురుషులు మహిళల క్రీడా పోటీలు పొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 14, 15 వ తేదీన నిర్వహించనున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనేవారు 2024 జులై 1వ తేదీ నాటికి 17 సంవత్సరాలు పైన 25 సంవత్సరాల లోపు వయసు కలిగి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఈ క్రీడల్లో పాల్గొను వారు స్టడీ, టెన్త్‌మార్క్స్ మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలు తీసుకొని 14వ తేదీ ఉదయం 8 గంటలలో లోపల డాక్టర్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ వైవీయూ ప్రొద్దుటూరులో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9052540530, 9000294626 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

14న జానమద్దిపై స్మారకోపన్యాస సభ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి సంవత్సర స్మారక ఉపన్యాసంలో భాగంగా ఈనెల 14న తెలుగుభాష వైభవంపై ఉపన్యాసం ఉంటుందని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా జస్టిస్ నూతలపాటి వెంకట రమణ హాజరవుతారని తెలిపారు. కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి సభకు అధ్యక్షత వహిస్తారని, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గౌరవ అతిథిగా హాజరవుతారని తెలిపారు. వైవీయూ బాధ్యకుల సచివులు ఆచార్య పుత్తా పద్మ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్టపరిధిలో విచారించి బాధితులకు న్యాయం అందించడానికి జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని ప్రజల అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విని, సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సబ్ డివిజన్, సర్కిల్ పరిధిలో, పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను పూర్తిగా విని సత్వర న్యాయం చేయాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిద్దవటం (ఒంటిమిట్ట) : మానసిక ఉల్లానికి, దేహధారుద్యానికి పోలీసులకు క్రీడా పోటీలు ఎంతో అవసరమని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 100 మీటర్లు, 800 మీటర్లు పరుగుపందెం పోటీలు, క్రికెట్, లాంగ్ జంప్, షాట్‌పుట్, షటిల్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.

హద్దులు దాటి ఆదాయం

- అడ్డదారుల్లో బియ్యం రవాణా
- అధికారమే అండగా కొనసాగుతున్న వ్యవహారం
- అన్నమయ్య జిల్లాలోని కలకడ, కలికిరి, గాలివీడులోని రైస్ మిల్లుల్లో పాలిష్
- గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక ప్రాంతాలకు అక్రమ రవాణా
- చక్రం తిప్పుతున్న రేషన్ మాఫియా



కలకడ మండలంలో సీజ్ చేసిన బియ్యాన్ని చిన్నమండెం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలిస్తున్న అధికారులు

రాయచోటి/కలకడ : రేషన్ బియ్యాన్ని రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడతామని ఒకవైపు బీరాలు పలుకుతుండగా మరోవైపు అదే కూటమికి చెందిన ముఠా మాఫియా మాత్రం టన్నుల కొద్దీ బియ్యాన్ని యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తోంది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం అవుతూ రేషన్ బియ్యం పంపిణీ వ్యవస్థపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని చెబుతున్నారు. ఎక్కడికక్కడ నిఘాను పెంచి అక్రమ తరలింపుకు పాల్పడుతున్న ముఠాలపై, అందుకు సహకరిస్తున్న అధికారుల పై ఉక్కుపాదం మోపుతామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ ప్రకటనలు కేవలం ప్రజలు వినడానికి, పత్రికల్లో రాసుకోవడానికి మాత్రమే అన్న ప్రచారం జరుగుతుంది. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల నుంచి లారీలకు లారీలు రేషన్ బియ్యాన్ని చెక్‌పోస్టులను దాటిస్తుండటమే ఇందుకు నిదర్శనం.దీనివల్ల కోట్లాది రూపాయల సొమ్ము టీడీపీ అనుయాయుల జేబులకు చేరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో స్థానికుల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఆయా జిల్లాల పరిధిలోని ఒకరిద్దరు అధికారులు ధైర్యం చేసి ఆకస్మిక తనిఖీలు చేస్తూ దాడులు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని సంబేపల్లి, కలకడ సరిహద్దు ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు, ఖాళీ గోడౌన్లలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల్లోనే 320 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.

ప్రొద్దుటూరు, కలకడ కేంద్రాలుగా..

వైఎస్ఆర్ జిల్లాలో ప్రొద్దుటూరు, ఖాజీపేట, అన్నమయ్య జిల్లాలో కలకడ, కలికిరి కేంద్రాలుగా రేషన్ బియ్యం అక్రమరవాణా దందా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఖాజీపేటకు చెందిన ఒక ముఠా, కలకడకు చెందిన మరో ముఠా అధికార పార్టీ నాయకులు కనుసన్నుల్లో పనిచేస్తూ.. కోట్లాది రూపాయల బియ్యాన్ని విక్రయిస్తూ.. లక్షలాది రూపాయల ఆదాయాన్ని గడిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాల పరిధిలో సేకరించిన రేషన్ బియ్యాన్ని తమకున్న అధికార బలంతో సమీపంలో ఉన్న రేషన్ మిల్లులకు తరలించి అక్కడ వాటికి పాలిష్ పట్టి కొత్త సంచుల ద్వారా లారీలకు లోడ్ చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ తరలింపులో పెద్ద పెద్ద గ్యాంగులు పనిచేస్తున్నట్లు సమాచారం. ఏజెంట్ల ద్వారా సేకరించిన బియ్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న ముందుచూపుతో మాఫియా రూటు మార్చి ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పక్క రాష్ట్రాలకు తరలిస్తోంది. ఏజెంట్ల దగ్గర కిలో పదహారు రూపాయలకు కొనుగోలు చేసి అవే బియ్యాన్ని మార్చి సాధారణ బియ్యంతో కలిపి విక్రయించి నెల నెల భారీ ఆదాయాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఈ వ్యవహారాల్లో పోలీసులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు, కొంత మంది ప్రజాప్రతినిధులకు ప్రతి నెలా పెద్ద ఎత్తున ముడుపులు కూడా అందుతున్నట్లు సమాచారం.

వైఎస్సార్ అన్నమయ్య జిల్లాల నుంచి అక్రమ రేషన్ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ఆధ్వర్యంలో ఒకవైపు దాడులు కొనసాగిస్తున్నా మరోవైపు అక్రమరవాణా మాత్రం ఆగడం లేదని తెలుస్తోంది. దాడులతో కేసులు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నా ఫలితం లేదు.

ప్రభుత్వం ప్రజల కోసం ప్రతి నెల 1 నుంచి 15వ తేదీల వరకు పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యంలో 60 శాతం పైగా బియ్యం పక్కదారి పడుతున్నట్లు సమాచారం. మాఫియా ఏజెంట్లు బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిలువ చేసి వాటిని కొత్త సంచుల్లోకి మార్చి గుట్టుచప్పుడు కాకుండా ప్రొద్దుటూరు, ఖాజీపేట, కలకడ, కలికిరి, గాలివీడు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

అధికార పార్టీ అండ

అక్రమ రేషన్ బియ్యం తరలింపులో అధికార పార్టీకి చెందిన బడా నేతల హస్తం ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎర్రచందనం అక్రమ రవాణాకు ఏమాత్రం తీసిపోని విధంగా రేషన్ బియ్యం అక్రమరవాణా సాగుతోంది. అధికార పార్టీ నాయకుల అండతోనే చౌక దుకాణం డీలర్ల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజులుగా కలకడ ప్రాంతంలో జరుగుతున్న అధికారుల దాడుల్లో ఆ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధి పాత్ర ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో 8291.785 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అన్నమయ్య జిల్లాలో అక్రమంగా రవాణా అవుతున్న 8291.785 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి 150 మందిపై కేసులు నమోదు చేసి 336 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసులు చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన మాఫియా నేతలు గుట్టుచప్పుడు కాకుండా అక్రమరవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు రేషన్ డీలర్లతో సమావేశం అవుతూ అక్రమరవాణాకు కట్టడి చేయాలన్న ప్రయత్నాలకు అధికార పార్టీ నాయకులు ముందుకు సాగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా అందిన సమాచారం మేరకు కొంత మంది అధికారులు దాడులు చేసినా అధికార పార్టీ నాయకుల నుంచి రాజకీయ ఒత్తిళ్లు అధికమవుతున్నట్లు సమాచారం. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న రైస్‌మిల్లులతో పాటు ప్రత్యేక గోదాముల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తిస్తున్నారు. అయితే అధికారం అడ్డుపెట్టుకొని ఆయా శాఖ పరిధిలోని కొంత మంది అధికారులను లోబరుచుకొని రేషన్ మాఫియా మాత్రం తమ దందాను రూటు మార్చి కొత్త మార్గాల్లో కొనసాగిస్తూనే ఉన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



అర్జీల నమోదులో ఏర్పడిన రద్దీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తగా కలెక్టరేట్ సభా భవనంలో గ్రీవెన్స్ సెల్ జరిగింది. కలెక్టరేట్ సిబ్బంది సభా భవన ఆవరణలో అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇక్కడ ఇరుగ్గా ఉండడం, రద్దీ కూడా అధికంగా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అర్జీదారులను క్యూలైన్‌లో ఉంచేందుకు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. ఇంతకుముందు విశాలమైన రేకుల షెడ్డులో అర్జీలు నమోదు చేసేవారు కనుక అక్కడ అందరికీ సౌకర్యవంతంగా ఉండేది. వచ్చే గ్రీవెన్స్ సెల్ నుంచైనా రేకుల షెడ్డులో అర్జీలు నమోదు చేసి సభా భవనంలోకి పంపితే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని అర్జీదారులు అభిప్రాయపడ్డారు. అర్జీలు నమోదు చేసుకున్న వారిని సభా భవనంలో కూర్చోబెట్టారు. క్రమపద్ధతిలో వారిని పిలిచి కలెక్టర్ అర్జీలను స్వీకరించి పరిశీలించారు. భూ ఆక్రమణలు, అసైన్డ్ భూముల సమస్యలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, వెంకటపతి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



కమలాపురం మండలం చిన్నచెప్పలిలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎస్. సవిత

ప్రొద్దుటూరు/కమలాపురం : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె పంచాయతీలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అర్జీలలో పరిష్కరించదగినవి వెంటనే పరిష్కరిస్తామని, మిగతా వాటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తామని.. నూతన టెక్స్‌టైల్స్ పాలసీని తీసుకొస్తున్నట్లు తెలిపారు. మైలవరంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేనేత వస్త్రాలపై ఐదు శాతం మేర జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వబోతున్నామన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాల కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ యువత ఉపాధి కల్పనకు 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ గంగయ్య, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, సర్పంచ్ అరవ మునివర ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, సీఎం సురేష్ నాయుడు, ఈవీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో...

కమలాపురం మండలం చిన్నచెప్పలి గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో మంత్రి సవిత పాల్గొన్నారు. అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను ఆమె పరిశీలించారు. కలెక్టర్ చెరకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకే ఈ రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారన్నారు. మండల స్పెషలాఫీసర్ సుబ్బారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ పీపీఎస్ బాబు, ల్యాండ్స్ సర్వే ఏడీ మురళీకృష్ణ, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్నింటిలోనూ విఫలం

- మద్దతు ధర చెల్లించి ఒక్క గింజ కొనని ప్రభుత్వం
- 13న ఛలో కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : రైతులకు సంబంధించిన ఒక్క సమస్య పరిష్కరించని కూటమి ప్రభుత్వం కేవలం గొప్పలు చెప్పుకోవడానికే రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు, మాయ మాటలతో ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. 7 నెలల పాలనలో ఎన్నికల్లో ప్రకటించిన ఏ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ పోయి రబీ సీజన్ కూడా సగం అయిపోయిందని, ఇంత వరకు రైతులకు 'అన్నదాతా సుఖీభవ' పథకం అమలు చేయలేదని మండి పడ్డారు. ఏ సీజన్‌లో జరిగిన నష్ట పరిహారాన్ని అదే సీజన్ చివరిలో ఇచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు బ్యాంకు రుణాలు పొందాలన్నా, వారి భూముల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరపాలన్నా, అడంగల్, 1బీ కూడా పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బీమా చెల్లించడానికి ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు చూపించక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల ఒక్క సమస్య కూడా పరిష్కరించని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఆన్‌లైన్ పని చేయక మైనింగ్ అనుమతులు కూడా ఆఫ్‌లైన్‌లోనే ఇస్తున్నారని, కాంట్రాక్టర్లు అనధికారికంగా డబ్బులు వసూలు చేసుకుని పర్మిట్లు ఇచ్చే దారుణ పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తోందన్నారు. మా ప్రభుత్వం రైతులకు సాగు ఖర్చులకు బాసటగా నిలిచి రైతు భరోసా ఇచ్చేదని, ఈ ప్రభుత్వం రెండు సీజన్లు వచ్చినా ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. రంగు మారిన ధాన్యాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం వరికి రూ.1740 మద్దతు ధర ప్రకటించిందేగాని ఒక్క గింజ కూడా కొనలేదన్నారు. ఆర్‌బీకేలకే రైతులను పిలిపించి మిల్లర్లతోనే రూ.1300 లతో ధాన్యం కొనుగోలు చేయిస్తోందని మండి పడ్డారు. రైతులు చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకంతో లబోదిబోమంటున్నారని, ఈ చేతకాని ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

13న భారీ ర్యాలీ:

రైతులు పండించిన పంటను మద్దతు ధర చెల్లించి దిగుబడులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు రైతు సమస్యల గురించి వినతి పత్రం ఇస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, షేక్ ఇస్మాయిల్, చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, శరత్‌బాబు, మోనార్క్, జిలానీ బాషా, సురేష్, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపునకు మార్గం సుగమం

- గండికోటకు జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు
- జాతీయ భౌగోళిక ప్రదేశాల్లో చోటు
- దేశంలోని 100 సైట్లలో స్థానం సాధింపు



గండికోట వ్యూ



గండికోటలోని పెన్నాలోయ

కడప కల్చరల్ : గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా ప్రపంచ స్థాయిలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా గుర్తింపు సాధించిన మన గండికోట మరో మెట్టుపైకి ఎక్కనుంది. దాంతోపాటు సాధారణ పర్యాటక ప్రాంతంగానే భావిస్తున్న గండికోటను విలక్షణ భౌగోళిక ప్రదేశంగా పలు దేశాలతో పోటీ పడి తన స్థానాన్ని మెరుగు పరుచుకుంటున్నది.

- ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో స్థానం సాధించే జాబితాలో గండికోట పదవ స్థానంలో చేరింది. ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేందుకు భారత పురాతత్వ సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) పది భూ విజ్ఞాన ప్రదేశాల జాబితాను పంపింది. ఈ విషయాన్ని భారతీయ గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు తెలియజేశారు. 10 భూ విజ్ఞాన ప్రదేశాలను ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేందుకు ఏఎస్ఐకి పంపగా, అవి పరిశీలనలో ఉన్నట్లు ఆయన వివరించారు. దేశంలో 100 భూ విజ్ఞాన వారసత్వ ప్రదేశాలను గుర్తించామని, అందులో 32 ప్రదేశాలను భూ విజ్ఞాన ప్రదేశాలుగా గుర్తించామన్నారు.
- 2015లో అంతర్జాతీయ జియో పార్కు ప్రోగ్రామ్ (ఐజీజీపీ)లో భాగంగా స్వీకరించిన యునెస్కో గ్లోబల్ జియో పార్కులు అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన భౌగోళిక వారసత్వాన్ని గుర్తించి రక్షించే బాధ్యతను చేపడుతున్నాయి. దేశంలో మరో రెండు ప్రదేశాలతోపాటు మన రాష్ట్రంలోని గండికోట క్యానియన్ లాంటి అద్భుతమైన వారసత్వ ప్రదేశాలు ఉన్నాయని గనులశాఖ కార్యదర్శి కాంతారావు అన్నారు. నిజానికి ఎక్కువగా గండికోటను పర్యాటక ప్రదేశంగా మాత్రమే గుర్తిస్తున్నారని, ప్రజలకు, వాటి భౌగోళిక ప్రాముఖ్యత గురించి తెలియదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ జియో లాజికల్ సైన్సెస్ (ఐయూజీఎస్)పేరుతో మరొక ప్రపంచ హోదా ఇచ్చే సంస్థ ఉందని, అందులో భాగంగా మన దేశంలో కొన్ని ప్రదేశాలను గుర్తించారన్నారు.

గ్రాండ్ క్యానియన్‌గా పిలవాలి

గండికోటను కేవలం చారిత్రక ప్రదేశమేగాక అద్భుతమైన భూ విజ్ఞాన వారసత్వ ప్రదేశమని భారత గనులశాఖ కార్యదర్శి అన్న మాటలు నిజమేనని పలువురు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు గండికోటను ప్రముఖ పర్యాటక ప్రదేశంగా ప్రత్యేకించి అద్భుతమైన కోటగల ప్రాంతంగా గుర్తించి గౌరవిస్తున్నామని, నిజానికి అంతకుమించి పెన్నా లోయ భూ విజ్ఞాన వారసత్వ సంపదగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే స్థాయి ఉందన్నారు. చారిత్రక ప్రదేశం కంటే ఈ భూ విజ్ఞాన వారసత్వ ప్రదేశంగానే ప్రపంచ వ్యాప్తంగా విలక్షణమైన గుర్తింపు లభించ గలదంటున్నారు. గండికోటలోని పెన్నా లోయను గ్యాడ్జిగా సంబోధించవద్దని, దాన్ని గ్రాండ్ క్యానియన్‌గా పిలువాలని చరిత్రకారులు సూచిస్తున్నారు. గ్యాడ్జి అంటే ఇరుకైన లోయ ప్రదేశమని, క్యానియన్ అంటే సువిశాలమైన లోయ మైదాన ప్రాంతమని వారు తెలుపుతున్నారు. దీంతో కేవలం చారిత్రకంగానే కాకుండా భౌగోళిక విజ్ఞాన వారసత్వ ప్రదేశంగా ప్రపంచ స్థాయిలో ఖ్యాతి పొందేందుకు గండికోటకు అర్హత ఉందని తెలుస్తోంది. ఇక కేవలం యునెస్కో గుర్తింపు లభించడమే ఆలస్యమని, ఆ తర్వాత గండికోటకు దక్కే ఖ్యాతి ప్రపంచ స్థాయిలో ఉంటుందని పేర్కొంటున్నారు.

గ్యాడ్జి కాదు... గ్రాండ్ క్యానియన్



గండికోటకు గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా ప్రపంచ పటంలో స్థానం లభించనుంది. గ్యాడ్జి అంటే ఇరుకైన లోయ అని అర్థం. గండికోటలోని పెన్నా ప్రవాహం చాలా విశాలమైనది. రెండు కొండల మధ్య 300 మీటర్లకుపైగా వైశాల్యం ఉంది. ఇదే ఈ ప్రాంతానికి ప్రత్యేకతను సంతరించి పెడుతోంది. యునెస్కో దీన్ని గుర్తిస్తే ప్రపంచ వ్యాప్త ఖ్యాతి లభిస్తుంది.
– బాలగొండ గంగాధర్, చరిత్రకారులు

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం మేరీ నగర్‌లో ఉంటున్న నాగూరు ఓబయ్య కుమారుడు నాగూరు ప్రవీణ్ (32) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖాజీపేట మండలం నాగసానిపల్లె గ్రామానికి చెందిన ప్రవీణ్ ప్రస్తుతం మేరీ నగర్‌లో నివాసముంటున్నాడు. కాగా మృతుడికి వివాహమై భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇతను వెల్డింగ్ పని చేసి జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు చింతకొమ్మదిన్నె సీఐ శంకర్ నాయక్ కేసు నమోదు చేశారు.

దంపతుల అదృశ్యం


అదృశ్యమైన భార్యాభర్తలు

మైలవరం : మైలవరం మండలానికి చెందిన భార్యాభర్తలు మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు మండల ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన గంజికుంట రాము, అతని భార్య చౌడం రాజేశ్వరి ఇరువురు కలసి ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ చేసి విచారించగా ఎలాంటి సమాచారం లేదు. వెంటనే రాజేశ్వరి తండ్రి చౌడం వెంకట సుబ్బయ్య మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయం

కొండాపురం : తన బ్యాంకు ఖాతాలోని నగదు మాయమైనట్లు కొండాపురం మండల కేంద్రానికి చెందిన పి.దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి వివరాల మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని ఫిన్ కేర్ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో తనకు అకౌంట్ ఉందన్నాడు. ఈ నెల 4వ తేదిన తన అకౌంట్‌కు సంబంధించిన ఫోన్‌పే నంబర్‌కు ఒక్క రూపాయి గుర్తుతెలియని వ్యక్తులు జమ చేశారన్నాడు. తర్వాత వెంటనే అదే ఖాతాలో రూ. 4300 కట్ అయిందని తెలిపారు. ఎవరికి ఎలాంటి ఓటీపీలు చెప్పకుండానే బ్యాంకు ఖాతాలో నగదు మాయమైందన్నాడు. సంబంధిత బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయమని సూచించారన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

కురబలకోట : మండలంలోని ముదివేడు పోలీసులు సోమవారం సాయంత్రం గంజాయి ముఠా గుట్టు రట్టు చేశారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కురబలకోట ఫ్లైఓవర్ దగ్గర గంజాయి సరఫరా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దిగుబడిపై దిగులు.!

- మామిడికి శాపంగా మారిన వాతావరణం
- సరైన చర్యలు చేపట్టకుంటే నష్టపోయే ప్రమాదం
- అన్నమయ్య జిల్లాలో భారీగా సాగు
- దిగుబడి.. ధరలపై గంపెడాశలతో మామిడి రైతు


చిన్నమండెం మండలం మల్లూరు గ్రామ పరిధిలో పూత దశలో ఉన్న మామిడి చెట్లు

రాయచోటి : వాతావరణ మార్పులు ఫలరాజంపై పగబట్టాయి. సాధారణంగా డిసెంబరు నెల నుంచి చలి మొదలవుతుంది. కానీ ఈ ఏడాది నవంబర్ నెల నుంచే చలితో పాటు దట్టమైన పొగమంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే సాగులో ఉన్న మామిడిలో 30 శాతం పైగా మామిడి పూత, పిందె దశలో కనిపిస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా వచ్చిన పూత, పిందెలు రాలిపోతున్నాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ మామిడి రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేలకు వేలు, లక్షల రూపాయలను తెగుళ్ల నివారణ కోసం మందుల కొనుగోళ్లకు వెచ్చిస్తున్నారు. మరికొంత మంది రైతులు అధిక దిగుబడిని సాధించేందుకు ఉద్యానవన అధికారులు సూచించినట్లుగా ఎరువులతో పాటు కల్తార్ మందులను వాడుతున్నారు. ఈ మందులు వాడడం వలన చెట్లలో ఉష్ణోగ్రతలు పెరిగి పూత, పిందె ముందుగా వస్తుంది. ఈ సమయంలో పూత, పిందెను కాపాడుకోకుంటే తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

రైతుల ఆశలన్నీ దిగుబడిపైనే..

మామిడి దిగుబడి, మార్కెట్‌లో లభించే ధరలపై గంపెడాశలు పెట్టుకున్న రైతులకు నిరాశ మిగిలేలా ఉంది. జిల్లాలో వరి, వేరుశనగ పంటతో సమానంగా మామిడి తోటలను సాగు చేశారు. జిల్లాలో 36వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇందులో 70 శాతం చెట్లు కాపు దశకు వచ్చినట్లు ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. అయితే పూత, పిందెకట్టే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న అనూహ్య మార్పులు, తోటలపై తీవ్ర ప్రభావం చూపాయి. సాధారణంగా జిల్లాలో డిసెంబరు ఆఖరు వారంకల్లా మామిడి పూత కనిపించి సంక్రాంతి పండుగకు పిందెలు ఏర్పడతాయి. కానీ నవంబరు నెల మొదటి వారంలోనే 30 శాతం చెట్లు పూత పూశాయి. అలాగే బెంగళూర(తోతపూరి), లాల్‌బహార్, ఖాదర్ వంటి రకాలు అప్పుడే పిందె దశలో ఉన్నాయి. ఇదే దశలో వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా మామిడిని తెగుళ్లు చుట్టుముట్టాయి.

మార్కెట్‌లో మామిడి రకాలు..

ప్రకృతి వైపరీత్యం.. అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యత కారణంగా మార్కెట్‌లో నిరంతరం మామిడి కాయలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. వారం రోజులుగా మామిడిలో రారాజైన హిమామ్ పసంద్, బేనీషా, ఖాదర్, బెంగుళూర వంటి రకాల మామిడి కాయలే కాకుండా పండ్ల రూపంలో అందుబాటులో ఉండడం విశేషం. దీంతో మామిడి పంటలకు సీజన్ అంటూ లేకుండా పోయిందన్న మాటలు వినిపిస్తున్నాయి.

సూక్ష్మపోషకాల వినియోగం..

మామిడిలో పూత, పిందెలు బాగా రావడానికి జింక్, బోరాన్ లాంటి సూక్ష్మపోషకాలు సహకరిస్తాయి. ఆకుల్లో పచ్చదనం వృద్ధి చెందేందుకు జింక్ దోహదపడుతుంది. జింక్ లోపించిన మొక్కల్లో ఆకులు చిన్నగా మారి, రెమ్మల ఎదుగుదల మందగిస్తుంది. ఫలితంగా మొక్కలు బలహీన పడతాయి. దీంతో పూత రాదు. ఇక బోరాన్.. మామిడి పూత, పిందె రావడానికి సాయపడుతుంది. పూ గుత్తుల్లో పిందె కట్టే ద్విలింగ పుష్పాలు అధికంగా రావడానికి దోహదపడుతుంది. పూర్తిస్థాయిలో ఫలదీకరణ జరిగి, పిందెలు అధికంగా ఏర్పడటానికి బోరాన్ ఉపయోగపడుతుంది. బోరాన్ లోపించిన చెట్లలో పిందె రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. కాయలపై బుడిపెలు రావడం, బంక కారడం, పగుళ్లు ఏర్పడటం లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. దీనిని నివారించడానికి జింక్, బోరాన్ ఉండే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని మామిడి చెట్లపై పిచికారీ చేయాలి.

పూత ఆలస్యమైన తోటల్లో పూ మొగ్గలను ఉత్తేజపరిచేందుకు లీటరు నీటిలో 10 గ్రాముల మల్టీ–కె (పొటాషియం నైట్రేట్), 5 గ్రాముల యూరియా చొప్పున కలిపి, రెమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. యూరియా, మల్టీ–కె లోని నత్రజని, పొటాష్ కలిసి పూ మొగ్గలను ఉత్తేజపరుస్తాయి. పూత బాగా రావడంతో పాటు పిందె కట్టడానికి, కాయలు నాణ్యంగా ఎదగడానికి సహకరిస్తాయి.

కవర్లు కట్టుకోండి..

మామిడిలో దిగుబడిని పెంచడానికి 'కాయలకు కవర్' కట్టడం మంచి పద్ధతి. 'మ్యాంగో ఫ్రూట్ ప్రొటెక్షన్ బ్యాగ్' కట్టడం వల్ల కాయలు అధిక బరువు పెరగడంతో పాటు చీడపీడల నుంచి రక్షణగా ఉంటుంది. చెట్టుపై ఉన్న మామిడి కాయ కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడే... ఒక్కో కాయకు ఒక్కో కవర్ కట్టాలి. అంతకుముందే కాయలను గుడ్డతో శుభ్రంగా తుడవాలి. కాయ కింది భాగం నుంచి తొడిమ పైభాగంలో 3 సెంటీమీటర్ల పైన కవర్‌ను కట్టాలి. దీనివల్ల తొడిమ వద్ద నల్లగా మసిపట్టడం, పురుగు పట్టడం, సొన కారడం లాంటివి నిరోధించవచ్చు. గాలి దుమారం వచ్చినప్పుడు కాయ రాలకుండా ఉంటుంది. వడగండ్ల వానతో కాయ పాడవదు. కాయలకు పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. చెట్టు మీదనే సహజసిద్ధంగా పండుతాయి. మామూలు కాయకంటే అదనంగా 100 గ్రాముల వరకూ బరువు పెరుగుతుంది.

- పిందె రాలడాన్ని అరికట్టడానికి 10 లీటర్ల నీటిలో 2 మిల్లీ లీటర్ల ప్లానోఫిక్స్ కలిపి పూ రెమ్మలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి.
- పూత ఆలస్యమైన తోటల్లో, కాయ పెరుగుదల సమయంలో డ్రిప్ ద్వారా నీరు అందించాలి.

తెగుళ్లతోనూ తీవ్ర నష్టం..

డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో చలి తీవ్రత వల్ల తోటల్లో తెగుళ్లు, చీడపీడల ఉధృతి పెరుగుతుంది. తేనె మంచు, బూడిద తెగులు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి పంటలో తేనెమంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు ఉధృతి ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఇదే కీలకం..

ప్రస్తుతం పూత, పిందెలు వచ్చే కీలక దశలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే, అధిక దిగుబడులు పొందవచ్చు. వాతావరణ మార్పుల వల్ల మామిడికి పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మామిడి పూత, కాత, కాయ నాణ్యత మెరుగుపరచడానికి స్థూల పోషకాలతోపాటు జింక్, బోరాన్, మాంగనీస్, ఐరన్ లాంటి సూక్ష్మ పోషకాల అవసరం ఎంతో ఉంటుంది. అవసరాన్ని బట్టి ఆయా పోషకాల మిశ్రమాలను పిచికారీ చేయాలి. జిల్లాలో కొంతమంది రైతులు అధిక దిగుబడిని పొందేందుకు కల్తార్ మందులను వాడారు. ఈ మందులను వాడిన తోటల్లో పూత, పిందెలు కనిపిస్తున్నాయి.

– రవిచంద్రబాబు, అన్నమయ్య జిల్లా ఉద్యానవన అధికారి

గొడవకు దారి తీసిన ఫోన్‌కాల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఒక ఫోన్ కాల్ వ్యవహారం గొడవకు దారి తీసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వైద్య ఆరోగ్య శాఖలో ఒక విభాగంలో పనిచేసే ఒక అధికారి ఫోన్ నుంచి ఒక నంబర్‌కు కాల్ వెళ్లింది. అందుకు సమాధానంగా అవతలి వ్యక్తి 'ఎవరికి ఫోన్ చేశావ్'' అని మాట్లాడారు. దీంతో పరస్పరం ఇద్దరి మధ్య ఫోన్‌లోనే మాటల యుద్ధం ప్రారంభమైంది. గొడవ తీవ్ర స్థాయికి చేరింది. తరువాత ఫోన్ చేసిన అధికారి ఫోన్ పెట్టేశాడు. ఫోన్‌లో మాట్లాడిన అవతలి వ్యక్తి ఆ తర్వాత తనకు ఫోన్ చేసింది తమ శాఖలోని ఓ సెక్షన్ అధికారి అని తెలుసుకుని ఆయనను బయట కలిసి మాట్లాడారు. ఆ సమయంలో వారి మధ్య మళ్లీ గొడవ జరిగినట్లుగా తెలిసింది. ఈ అంశం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


బషీరున్ (ఫైల్)

సిద్దవటం (ఒంటిమిట్ట) : మండలంలోని మాచుపల్లి గ్రామ పంచాయతీ, తురకపల్లి గ్రామానికి చెందిన బషీరున్ (24) అనే వివాహిత సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి అన్న మస్తాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరానికి చెందిన బషీరున్‌కు తురకపల్లికి చెందిన మహమ్మద్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. భర్త మహమ్మద్ జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. తురకపల్లి గ్రామంలో బషీరున్ ఉన్న నివాస గృహానికి ఒక వైపు అత్త, మామలు, మరోవైపు మరిది నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు బషీరున్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందినట్లు అత్తా మామలు మస్తాన్‌కు సమాచారం ఇచ్చారు. బషీరున్ మృతదేహాన్ని పరిశీలించి ఆమె మెడ, ఛాతీపై గాయాలు ఉండటంతో మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. సిద్దవటం ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆర్.కృష్ణయ్యకు అధికారమే పరమావధి

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ నాయకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందిన ఆర్.కృష్ణయ్యకు అధికారమే పరమావధిగా మారిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ విమర్శించారు. ఈమేరకు ఆయన పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ నాయకుడిగా ఉన్న ఆర్.కృష్ణయ్యను చేరదీసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చారన్నారు. పక్క రాష్ట్రం వాడైనా ఎన్ని అభ్యంతరాలు వచ్చినా లెక్క చేయక రాజ్యసభలో బీసీ వాణిని బలంగా వినిపిస్తారన్న నమ్మకంతో రాజ్యసభ సభ్యునిగా నియమించారన్నారు. ఆయన రాజ్యసభలో బీసీల గురించి మాట్లాడింది ఒకటి రెండు సందర్భాలే అని, బీసీల సమస్యలపై ఏనాడూ గొంతెత్తి ప్రభుత్వాన్ని నిలదీసిందిలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓటమి చెందగానే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సొంత పార్టీ పెడతానన్న ఆయన పార్టీని పక్కన పెట్టి బీజేపీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక కావడం ఆయన అధికార దాహానికి నిదర్శనమన్నారు. కృష్ణయ్య అధికారం ఉన్న పార్టీల్లో ఉంటూ తన పబ్బం గడుపుకుంటున్నారే తప్ప బీసీల కోసం చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్రెడ్ ఫ్యాక్టరీలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు


ఫ్యాక్టరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సంజీవనగర్‌లోని ఆర్‌పీఆర్ బ్రెడ్ ఫ్యాక్టరీలో సోమవారం ఫుడ్‌సేఫ్టీ అధికారి హరిత తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్టరీలో తయారు అవుతున్న బ్రెడ్లు, బిస్కెట్లను పరిశీలించారు. వాటి తయారీకి ఉపయోగిస్తున్న పదార్థాలను తనిఖీ చేశారు. ల్యాబ్‌కు పంపించేందుకు బ్రెడ్, బిస్కెట్లతో పాటు ఆయిల్, ఇతర పదార్థాల శ్యాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ రిపోర్టులో ఏవైనా లోపాలున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తాగునీటి సరఫరాపై ప్రజలనే అడుగుదాం.. రండి

- టీడీపీ పాలనలో కడపలో తాగునీటి సమస్యను పట్టించుకోలేదు
- వైఎస్సార్ సోమశిల బ్యాక్‌వాటర్ స్కీం తెస్తే రద్దు చేయించారు
- మాజీ సీఎం వైఎస్ జగన్ బ్రహ్మంసాగర్‌లో 1.50 టీఎంసీలు కేటాయించారు
- రూ.530 కోట్లతో టెండర్లు కూడా పూర్తి చేశారు
- ఆ పనులను పూర్తి చేయించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిది కాదా.!
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డిపై మండిపడిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నారో లేదో ప్రజలనే అడుగుదాం... రండి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సవాల్ విసిరారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప నగరంలో ఏడు రోజులకొకసారి తాగునీళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆర్. మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి ఆరోపించడం దారుణమన్నారు. కడపలో ఏ ప్రాంతానికి ఎన్ని రోజులకొకసారి, ఎన్ని గంటలపాటు నీరు ఇస్తున్నారో లాగ్ బుక్ చూసి తెలుసుకోవాలన్నారు. స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లవుతున్నా కడపలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఎవరూ ప్రయత్నించలేదని, దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. వైఎస్‌ఆర్ రూ.770 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో సోమశిల బ్యాక్ వాటర్ స్కీం తీసుకొచ్చారని, ఆయన మరణానంతరం 2011లో టీడీపీ నేత చంద్రమోహన్‌రెడ్డి ధర్నా చేయడంతో అప్పటి సీఎం రోశయ్య ఆ స్కీంను రద్దు చేశారన్నారు. 2014–19 వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, ఇదే శ్రీనివాసులరెడ్డి కడప ఇన్‌చార్జిగా ఉన్నారని అప్పుడు వారు నీటి సమస్యను తీర్చేందుకు ఏమాత్రం ప్రయత్నించలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బ్రహ్మంసాగర్‌లో కడప తాగునీటి కోసం 1.50 టీఎంసీల నీటిని కేటాయించి, రూ.530 కోట్లతో పైపులైన్ వేసి గ్రావిటీతో నీటిని తీసుకురావాలని టెండర్లు కూడా పూర్తి చేసి, కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా జరిగిందన్నారు. ఆలోపే ఎన్నికలు వచ్చాయని, ఆ పనులను పూర్తి చేయించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే నన్నారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించాల్సిన టీడీపీ నేతలు కమీషన్లకు కక్కుర్తి పడి ఈ పనులను చేయించడం లేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వస్తే ఆరునెలల్లోనే బుగ్గవంక బ్రిడ్జిలు పూర్తి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే మాధవి.. మాట నిలబెట్టుకోలేక పోయారన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న కడపను చెడగొట్టాలని వీరు కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఈ ఆరునెలల్లో గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్పా వారు చేసిందేమీ లేదని, ఒక్క రూపాయి నిధులు తేలేదని విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, మగ్బూల్‌బాషా, సుబ్బారెడ్డి, చంద్రహాసరెడ్డి, సుబ్బారెడ్డి, సానపురెడ్డి శివకోటిరెడ్డి, షంషీర్, అఫీపుల్లా బాషా, నాగేంద్ర, డివిజన్ ఇన్‌చార్జులు బసవరాజు, ఐస్‌క్రీం రవి, కిరణ్, ఎన్. ప్రసాద్‌రెడ్డి, బండి ప్రసాద్, డిష్ జిలాన్, సుబ్బరాయుడు, సుదర్శన్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు



హత్య కేసులో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా చక్రాయపేట మండలం గండికొవ్వూరు గ్రామంలో ఈనెల 6వ తేదీన దండు యోగాంజనేయులు హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సంఘటనలో మృతుని భార్య దండు శివలక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితులైన అదే గ్రామానికి చెందిన నల్లకదిరిగాళ్ల నాగార్జున, తల్లి సావిత్రమ్మ, చెల్లెలు నాగమణిలపై కేసు నమోదు చేసి చక్రాయపేట ఎస్‌ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితులను చక్రాయపేట మండలంలోని వేంపల్లి – రాయచోటి రోడ్డులో గాలివీడు క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేయడంలో కృషి చేసిన పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, ఆర్‌కే వ్యాలీ సీఐ ఉలసయ్య, చక్రాయపేట ఎస్‌ఐ కృష్ణయ్య, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కొడవలితో పాఠశాలకు వెళ్లిన విద్యార్థి

- తోటి విద్యార్థులను బెదిరించేందుకే అన్న ఉపాధ్యాయులు
- కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు

మదనపల్లె : అమ్మాయితో మాట్లాడుతున్న విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారన్న కోపంతో తోటి విద్యార్థులను బెదిరించేందుకు పదో తరగతి విద్యార్థి కొడవలిని పాఠశాలకు తీసుకెళ్లిన ఘటన సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పదోతరగతి విద్యార్థి, అదే పాఠశాలకు చెందిన అమ్మాయితో చనువుగా మాట్లాడుతుండటాన్ని తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు విద్యార్థిని మందలించారు.

ఇది అవమానంగా భావించిన విద్యార్థి తోటి విద్యార్థులపై కోపం పెంచుకుని, వారిని బెదిరించేందుకు సోమవారం పాఠశాలకు కొడవలిని తీసుకువచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థులు ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. వారు విచారిస్తే నిజమేనని తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు పాఠశాలకు చేరుకుని విద్యార్థిని మందలించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిసింది.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై విచారణ

సిద్దవటం (ఒంటిమిట్ట) : మండలంలోని పోలీస్ బెటాలియన్‌లో డిసెంబర్ 7వ తేదీన జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ మాట్లాడుతూ మెనూ లోపం ఉందని పలువురు ఫిర్యాదు చేయడంతో అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదిక జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవీలత, ఇన్‌చార్జి ఎంపీడీఓ మెహతాజ్ యాస్మిన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, హెడ్మాస్టర్ నాగముని రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ హరి, కృష్ణయ్య, కో–ఆప్షన్ సభ్యులు కృష్ణ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ హత్య కేసులో నిందితులు జువైనల్ హోమ్‌కు

రాయచోటి : తరగతి గదిలో ఉపాధ్యాయునిపై దాడి చేసి మృతికి కారకులైన ఇద్దరు విద్యార్థులను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన రాయచోటి పట్టణం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఏజాస్ అహమ్మద్‌పై దాడి చేసి చంపిన విషయం తెలిసిందే.

ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తమ విచారణలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈ దాడిలో పాల్గొన్నట్లు నిర్ధారణ అయిందని సీఐ తెలిపారు. వారిద్దరినీ ఈ నెల 7వ తేదీన జువైనల్ కోర్టుకు హాజరుపరచగా కోర్టు వారిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

గొర్రెల షెడ్డు నిర్మాణంలో విద్యుత్ షాక్‌తో వెల్డర్ మృతి

కురబలకోట : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వెల్డర్ మృతి చెందాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. వాల్మీకిపురం మండలం మద్రిపాడుకు చెందిన సాదిక్ అలీ (30) సోమవారం కురబలకోట మండలంలోని ఎర్రమద్దివారిపల్లెలో ఓ రైతు గొర్రెల షెడ్డు నిర్మాణానికి రేకులు వేయడానికి కూలీలతో కలసి వెళ్లాడు. షెడ్డుకు రేకులు వేస్తుండగా దాని పైనే 11 కేవీ లైన్ వెళుతోంది. ఈ లైన్ పైకి లేపడానికి పీవీసీ పైపు సాయంతో ప్రయత్నించారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. సాదిక్ అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలను స్థానికులు రక్షించారు. 11 కేవీ లైన్ ఉందని ముందే హెచ్చరించినా రైతు తమ మాటను వినిపించుకోలేదని విద్యుత్ అధికారులు తెలిపారు.

37 ద్విచక్రవాహనాలు స్వాధీనం

నలుగురు బాల నేరస్తులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకట్రాద్రి, చిత్రంలో డీఎస్పీ కృష్ణమోహన్ ఇతర సిబ్బంది

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలో నలుగురు ద్విచక్రవాహనాల దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ.65లక్షల విలువైన 37 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అదనపు (అడ్మిన్ ఎస్పీ) యం. వెంకట్రాద్రి తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె – తిరుపతి రోడ్డులో వాయల్పాడు రైల్వే రోడ్డు మూడు రోడ్ల కూడలి వద్ద వాయల్పాడు సీఐ జె. ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్, శ్రీ హరి వాహనాల తనిఖీ నిర్వహించారని తెలిపారు. అదే సమయంలో రెండు ద్విచక్రవానాలపై నలుగురు వచ్చారని తెలిపారు. వారి వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించగా ఆ వాహనాలు చోరీకి గురయినవని తెలిసిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం 37 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.65 లక్షలకు వరకు ఉంటుందని ఆయన వివరించారు. ఈ వాహనాలను చిత్తూరు, తిరుపతి, కర్ణాటక రాష్ట్రాల్లో చోరీ చేశారని తెలిపారు. నలుగురు నిందితుల్లో మదనపల్లె పట్టణం సీటీఎంకు చెందిన బత్తల వినోద్ (19)తో పాటు మరో 14–15 సంవత్సరాల మధ్య వయస్సు గల మరో ముగ్గురిని గుర్తించామని చెప్పారు. వీరి తల్లిదండ్రులు అందరూ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలలో ఉన్నారని వీరిని ఉన్నత చదువుల కోసం తమ సమీప బంధువుల ఇంటిలో ఉంచి చదివిస్తున్నారని తెలిపారు. అయితే తమకు చెప్పేవారు లేకపోవడంతో దుర్వ్యసనాలకు లోనై అధికంగా డబ్బుల కోసం ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు వారు వివరించినట్లు తెలిపారు. ఈ వాహనాల తనిఖీలో పాల్గొన్న వాయల్పాడు హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, సి. వేణుగోపాల్, అబ్దుల్లా జి. మోహన్‌బాబు, సి. పుల్లయ్య, ఇతర సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో రాయచోటి డీఎస్పీ ఎంటీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.